సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం । 6 । ఫిబ్రవరి । 2024



గంజాయి ముఠా అరెస్ట్

గంజాయి ముఠాను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి కారు, వంద కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. - 8లో

బెటాలియన్ కమాండెంట్ బాధ్యతలు స్వీకరణ



సిద్దవటం మండల పరిధి భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్ కమాండెంటుగా రవిశంకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.270	రూ.360
రెండోరకం	రూ.160	రూ.268

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 94 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	440	490
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 151.220 కిలోలు

అన్నదాతలకు భరోసా

అవ్వాతాతలకు ముద్దుల మనవడతను..
కష్టాల్లోనే కాదు అవసరమైన ప్రతీసారి తోడుగా నిలిచే ఇంటి పెద్ద కొడుకతను..
విద్యార్థులకు మావయ్యా అతడే...
ఇక అన్నదాతలకు కొండంతా అండగా నిలిచే అన్నయ్యా అతడే.

అవును.. సాగులో 'భరోసా' ఇవ్వడమే కాదు ఇంటి ముంగిటకే అన్నీ తెచ్చి వారికి తోడూగా నిలబడ్డాడు.. అందుకే రైతులు ఆయన్ను 'మా జగనన్న' అంటూ ప్రేమగా పిలుచుకుంటారు. నాడు రాజన్న రైతన్నల కోసం ఎంతగా తపించిపోయారో.. నేడు ఆయన బిడ్డ వైఎస్ జగన్ అంతకుమించి కొండంత అండగా నిలబడ్డారు. ఆర్‌బీకేల పేరిట వ్యవసాయ రంగంపై సీఎంగా వైఎస్ జగన్ వేసిన ముద్ర చరిత్రలో నిలిచిపోవడం ఖాయం.

- ఆర్‌బీకేల ద్వారా ఉన్న ఊర్లోనే పలు రకాల వ్యవసాయ సేవలు
- విత్తు నుంచి ఎరువుల వరకు అన్ని రకాల సేవలు
- వ్యవసాయ సూచనలతోపాటు పంటల సాగుపై అవగాహన
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



చాపాడు మండలం ఖాదరాపల్లెలోని రైతు భరోసా కేంద్రం



కడప అగ్రికల్చర్ : ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక వ్యవసాయానికి పెద్దపీట వేసి రైతన్నను రాజును చేశాడు. అందరికి అన్నం పెట్టే అన్నదాత ఆనందంగా ఉంటే అందరూ సుభిక్షంగా ఉంటారనే నమ్మకంతో వారికి అడుగడుగునా అండగా నిలిచారు. వ్యవసాయ పరంగా ఉన్న ఊర్లోనే వారికి కావాల్సిన అన్ని రకాల సేవలను అందించేందుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి వ్యవసాయాన్ని పండుగలా మార్చారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తు దగ్గర నుంచి ఎరువుల వరకు అందిస్తున్నారు. అలాగే పంటలసాగు నుంచి పంట దిగుబడుల వరకు, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించి అక్కడే కొనుగోలు చేసి వారం పదిరోజుల్లో రైతు ఖాతాలకు నగదును జమ చేస్తున్నారు. అంతేకాకుండా అలాగే గ్రామ వ్యవసాయ సహాయకులు ద్వారా రైతులకు పంటల సాగు విషయంలో అవసరమైన సూచనలు, సలహాలను అందిస్తూ ఆదుకుంటున్నారు.

ఉన్న ఊర్లోనే అన్ని సేవలు..

రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయకముందు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కోసం రైతన్నలు మండల కేంద్రానికో లేక జిల్లా కేంద్రానికో వెళ్లాల్సి వచ్చేది. ఇక పండించిన ఉత్తత్పులను విక్రయించుకోవాలంటే ఉన్న ఊర్లో దళారులను లేకుంటే దూర ప్రాంతంలో ఉన్న మిల్లుల వద్దకే వెళ్లాల్సి ఉండేది. కానీ రైతు భరోసా కేంద్రాలు వచ్చిన తరువాత ఉన్న ఊర్లోనే అన్ని రకాల సేవలను పొందుతున్నారు. విత్తనాలు,ఎరువులు, పురుగు ముందులు సైతం గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లోనే అందుతున్నాయి. పంట ఉత్పత్తుల కొనుగోలు కూడా జరుగుతుంది. ధాన్యాన్ని రైతు కళ్లాల వద్దకు వెళ్లి ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది. వీటితోపాటు రైతులు ఏయే పంటలు సాగు చేశారు. సాగు చేసిన పంటలకు ఈ క్రాపు బుకింగ్ వంటి సేవలు కూడా అందుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటనష్టం జరిగినప్పుడు అంచనా వేయడం కూడా ఆర్‌బీకేల సిబ్బందే చేస్తున్నారు. ఈ పనులన్నింటి కోసం వ్యవసాయ సహాయకులను ఏర్పాటు చేశారు. ఇలా రైతు భరోసా కేంద్రాలు రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నాయి.

దళారీల ప్రమేయం లేకుండా..

గ్రామీణ ప్రాంతంలో రైతులు పండించిన పంట దిగుబడులను దళారీలు ద్వారా కొనుగోలు చేసేవాళ్లు. దీంతో వారు చెప్పిందే వేదంగా ఉండేది. దీంతోపాటు తూకాలలో కూడా పలు తేడాలు ఉండేవి. కానీ ప్రస్తుతం వ్యాపారులు, దళారుల ప్రమేయం లేకుండా ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వమే గిట్టుబాటు ధరతో ధాన్యాన్ని కొనుగోలు చేస్తోంది. కొనుగోలు చేసిన ధాన్యానికి వారం పది రోజుల్లో నేరుగా రైతు ఖాతాలకే నగదును జమ చేస్తోంది.

వైఎస్సార్ జిల్లాలోని ఉన్న ఆర్‌బీకేలు	: 432
గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ఆర్‌బీకేలు	: 422
పట్టణ ప్రాంతాల్లో ఉండే ఆర్‌బీకేలు	: 12
సొంత భవనాలు ఉన్న ఆర్‌బీకేలు	: 297
బేస్‌మట్టం స్థాయిలో ఉన్న ఆర్‌బీకేలు	: 46
స్లాబ్ పూర్తయిన ఆర్‌బీకేలు	: 46
రూఫ్‌లెవల్ ఉన్న ఆర్‌బీకేలు	: 09
స్లాబ్ పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఆర్‌బీకేలు	: 14
స్థల సమస్యతో ప్రారంభం కాని ఆర్‌బీకేలు	: 10

వైఎస్సార్ రైతు భరోసా నిధుల వివరాలు ఇలా..




సంవత్సరం	రైతులు	వెచ్చించిన నిధులు (కోట్లలో)
2019-20	206708	279.93
2020-21	208747	280.06
2021-22	199344	269.11
2022-23	229013	287.50
2023-24	205600	155.00

ఎరువుల వివరాలు ఇలా...



సంవత్సరం	మెట్రిక్ టన్నుల్లో
2021-22	1,42,802
2022-23	1,43,150
2023-24	1,27,618 (జనవరి వరకు)

విత్తనాల వివరాలు ఇలా...



సంవత్సరం	క్వింటాల్లో
2021-22	65,857
2022-23	48,470
2023-24	83,018

ఆర్‌బీకేల ద్వారా అందించే సేవలివే...

- ఆర్‌బీకేల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్, హార్టికల్చర్ అసిస్టెంట్, సెరికల్చర్ అసిస్టెంట్, విలేజ్ అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్లు నిర్వహిస్తారు.
- రైతులకు సబ్సిడీ విత్తనాల గ్రామస్థాయి పంపిణీ
- గ్రామస్థాయిలో రైతులకు సర్టిఫైడ్ హామీతో కూడిన ఇన్‌పుట్‌ల సరఫరా
- ఈ క్రాపు బుకింగ్‌కు రైతు డేటాబేస్ అప్‌లోడ్ చేయడం
- రైతులకు పంట సాగుదారుల హక్కు ధృవీకరణ పత్రం జారీ చేయడం
- గ్రామస్థాయి విత్తన సేకరణ కార్యకలాపాలు, ఎంఎస్‌పి, మార్కెట్ ఇంటిలిజెన్స్, ఏఫ్‌ఏక్యూ నిబంధనలపై సమాచారం అందించడం
- పీఎం కిసాన్, వైఎస్సార్ ఆర్‌బి మరియు వైఎస్సార్ సున్నావంటి పంట రుణాల కోసం డేటా అప్‌లోడ్ చేయడం
- విత్తనాలు, ఎరువులు, పురుగుముందులు, పశువుల దాణా మొదలైన ముందుగా పరీక్షించిన నాణ్యమైన వ్యవసాయ ఇన్‌పుట్‌ల సరఫరా
- వివిధ పథకాల కింద లబ్ధిదారులందరి సామాజిక తనిఖీ, అంటే ప్రకృతి వైపరిత్యాలు, సబ్సిడీ విత్తనాలు మొదలైనవి
- డిజిటల్ లైబ్రరీ ద్వారా తెగుళ్ల మరియు వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించడం
- పొలంబడి, సీడ్ విలేజ్ ప్రోగ్రాం, మినికిట్ ట్రయల్ ప్లాట్లు మొదలైన ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్‌ల నిర్వహణ
- విత్తన పరీక్ష(భౌతిక స్వచ్ఛత మరియు ఆకురోత్పత్తి పరీక్ష)
- రైతుల సామర్థ్యాన్ని పెంపొందించడం, ఉత్తమ నిర్వహణ పద్ధతుల వ్యాప్తి, పొలంబడి, పద్ధతి ప్రదర్శనలు మొదలైనవి
- స్మార్ట్ టీవీ(డిజిటల్ సిగ్నేజ్) క్రాపు నిపుణులచే సాంకేతిక సెషన్‌ల చిరునామాను ప్రత్యక్ష ప్రసారం చేయడం
- అన్ని ప్రభుత్వ పథకాలకు సేవా కేంద్రం
- ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ: జంతువల ప్రథమ చికిత్స, ట్రావిస్

కష్టాలు తప్పాయ్...



రైతు భరోసా కేంద్రాలు వచ్చాక రైతులకు చాలావరకు కష్టాలు తగ్గాయి. రైతు భరోసా కేంద్రాలు లేనప్పుడు వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉన్న సమయంలో రైతులు ఎరువులకు, పురుగుమందులకు కోసం మండల కేంద్రాలకు పరుగులు తీయాల్సి వచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేదు. అన్ని ఊర్లో ఉండే రైతు భరోసా కేంద్రంలోనే రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు తెచ్చుకుంటున్నారు. – సంబటూరు ప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర ఉద్యాన సలహాదారు.

ఏటా రైతు భరోసా...



రైతు బరోసా కేంద్రం ద్వారా ఈ క్రాపును సకాలంలో బుకింగ్ చేస్తున్నారు. దీంతో ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు నష్టపరిహారం అందుతుంది. దీంతోపాటు ప్రతి ఏటా నిర్దేశించిన సమయానికి రైతు భరోసా డబ్బులు నా బ్యాంకు ఖాతాకు జమవుతోంది. దీంతో పంటలసాగు సమయంలో విత్తనాలు, ఎరువులకు డబ్బులతో సమస్య లేకుండా పోయింది. – ధనిరెడ్డి బాస్కర్‌రెడ్డి, టంగటూరు, రాజుపాలెం మండలం.

ఆర్‌బీకే ద్వారా అన్ని రకాల సేవలు..



గ్రామీణ ప్రాంత రైతులు వ్యవసాయ పరంగా కావాల్సిన సేవలను రైతు భరోసా కేంద్రాల ద్వారా అందుతున్నాయి. అలాగే పంటలసాగు సమయంలో వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలను ఇస్తూ పంటల సాగుకు సహకరిస్తున్నారు. దీంతోపాటు రైతులు సాగు చేసిన పంటలకు చీడపీడలను ఆశించినప్పుడు కూడా సకాలంలో వారి సలహాలను పాటించి పంట నష్ట తీవ్రతను కాపాడుకుంటున్నారు. – నాగేశ్వర్ రావు, వైఎస్సార్ జిల్లా వ్యవసాయ అధికారి

న్యూస్‌రీల్

ఓకేషనల్ ప్రాక్టికల్స్ ప్రారంభం

కడప ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియట్‌కు సంబంధించిన ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు జిల్లాలో సోమవారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉదయం సెషన్‌కు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 17 పరీక్షా కేంద్రాలలో 1246 మందికి 1146 మంది హాజరుకాగా 100 మంది గైర్హాజరైనట్లు ఇంటర్మీడియట్ ఆర్ఐవో బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. అలాగే మధ్యాహ్నం సెషన్‌లో 16 పరీక్షా కేంద్రాలకు 1020 మంది హాజరుకావాల్సి ఉండగా 969 మంది హాజరుకాగా 51 మంది గైర్హాజరయ్యారు.

ప్రశాంతంగా కౌన్సెలింగ్



'ఎంఎల్‌హెచ్‌పీ'ల నియామకాలు చేపడుతున్న ఆర్డీ రత్నకుమారి తదితరులు

కడప రూరల్ : వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్–4 పరిధిలో కడప ఐఎంఏ హాల్‌లో సోమవారం నిర్వహించిన ఎంఎల్ హెచ్‌పీల నియామకాల కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 56 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి, పోస్టింగ్‌లను కల్పించారు. ప్రభుత్వ ఆదేశాలు, నిబంధనల ప్రకారం నియామకాలు చేపట్టినట్లు రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారి తెలిపారు. కార్యక్రమంలో ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ భక్తవత్సలం, సూపరింటెండెంట్ గోపాల్‌రెడ్డి, వెంకటసుబ్బమ్మ, సీనియర్ అసిస్టెంట్ బత్తనయ్య, అతావుల్లా, వనీష తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీపీపీలో ఉద్యోగుల ధర్నా

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎంవీఆర్ఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు నందు పనిచేస్తున్న ఉద్యోగులు వారి వేతనాల కోసం సోమవారం ప్లాంట్ గేటు బయట ధర్నా నిర్వహించారు. ప్రతి నెల వేతనాలు చెల్లించడంలో ఆలస్యం అవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంటర్ తత్కాల్ ఫీజు పెంపునకు గడువు పెంపు

కడప ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఐపీఈ మార్చి 2024 పరీక్ష రుసుము(తత్కాల్ స్కీం) చెల్లింపుకోసం ఆలస్య రుసుముతో ఈనెల 10వ తేదీ వరకు ఇంటర్‌బోర్డు గడువు పెంచిందని ఆర్ఐవో బండి వెంకట సుబ్బయ్య తెలిపారు. ఐపీఈ పరీక్ష రుసుం చెల్లించడానికి ఇదే చివరి అవకాశం అని, ఇంకా ఎవరైన ఫీజు చెల్లించని విద్యార్థులుంటే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ తేదీ తరువాత ఎట్టి పరిస్థితుల్లో మళ్లీ గడువు పొడగించబడదని ఆయన తెలిపారు. నిబంధనల ప్రకారం అవసరమైన ఆలస్య రుసుము రూ. 3000ను తాము చదివిన జూనియర్ కళాశాలలో చెల్లించి పరీక్షలకు హాజరు కావచ్చని ఆర్ఐఓ వెంకట సుబ్బయ్య తెలిపారు.

కడపవాసికి ఉత్తమ డైరెక్టర్ అవార్డు

కడప కల్చరల్ : ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంస్థ జిల్లాకు చెందిన యువ సినీ దర్శకుడు యు.హేమారెడ్డికి బెస్ట్ డెబ్యూ డైరెక్టర్ అవార్డు బహూకరించింది. ఆదివారం రాత్రి తిరుపతిలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో నిర్వాహకులు ఈ పురస్కారాన్ని అందజేశారు. 2024 సంవత్సరానికి ఉత్తమ తొలి సినిమా తీసిన డైరెక్టర్‌గా ఆయనకు ఈ పురస్కారం లభించింది. హేమారెడ్డి వైఎస్సార్ జిల్లాకు చెందిన వారు. ఆయన సోదరుడు ఎస్వీ శివారెడ్డి సినీ రంగంలో ఫొటోగ్రాఫర్‌గా ఉన్నారు. ఆయన సహకారంతో హేమారెడ్డి గత సంవత్సరం ఏపీ04 రామాపురం చిత్రం తీశారు. ఈ సినిమాకే అవార్డు దక్కింది. నిర్మాతలు కూడా వైఎస్సార్‌జిల్లాకు చెందిన వారు కావడం విశేషం.



అవార్డు అందుకుంటున్న హేమారెడ్డి

అన్వేషణ-24 పోటీలలో ఫస్ట్

కురబలకోట : పలమనేరు మదర్ థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయిలో జరిగిన అన్వేషణ-24 పోటీలలో అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ కంపూటర్ సైన్స్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఎస్.జబహీర్, అనికేత్ అరుణ్ సుస్మాల్, పి.అన్వర్ అలీఖాన్ మొదటి స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. రూ.15 వేలు నగదు బహుమతి అందుకున్నట్లు తెలిపారు.



అన్వేషణ పోటీల్లో మొదటి బహుమతి సాధించిన మిట్స్ విద్యార్థులు

12న అప్రెంటీస్ మేళా

కడప ఎడ్యుకేషన్ : వైఎస్సార్ జిల్లాలో ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్ కమ్ రోజ్‌గార్ మేళా మరియు మినిస్ట్రీస్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఎంటర్‌ప్రెన్యూర్ వారి ఆధ్వర్యంలో దేశమంతటా ఈ నెల 12వ తేదీ ఉదయం 10 గంటలకు అప్రెంటీస్ మేళాను నిర్వహిస్తున్నట్లు కడప ప్రభుత్వ ఐటీఐ మైనార్టీ జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ జ్ఞాన కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా కడపలోని ప్రభుత్వ డీఎల్‌డీసీ/ఐటీఐ నందు 12వ తేదీ ఉదయం 10 గంటలకు అప్రెంటీస్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో వివిధ కంపెనీలు పాల్గొని తమకు కావాల్సిన ట్రేడ్ విద్యార్థులను ఎంపిక చేసుకుంటారన్నారు. ఐటీఐ పాస్ అయిన అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్స్ అయిన 10వ తరగతి మార్కుల జాబితా, ఐటీఐ మార్కుల జాబితా, ఐటీఐ ఎన్‌టీసీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, బ్యాంకు అకౌంట్ పుస్తకం, పాస్ పోర్టు సైజ్ ఫొటోతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలు తీసుకుని తప్పక హాజరు కావాలన్నారు. అప్రెంటీస్‌షిప్ సందర్భంగా నెలకు రూ.8050 చెల్లిస్తామన్నారు.



విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్స్ కార్యవర్గం

కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) కాంట్రాక్టు వింగ్ కడప జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏఐటీయూసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఈ జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు గౌరవాధ్యక్షుడు ఈశ్వరయ్య తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా కేవీ నాగిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డి.జయక్రిష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఓ. సురేష్ బాబు, ఉపాధ్యక్షులుగా ఎ.నాగరత్నాచారి, కొండారెడ్డి, రామక్రిష్ణారెడ్డి, శ్రీనివాసులు, శ్రీధర్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శిగా గఫార్‌బాషా, సహాయ కార్యదర్శులుగా బ్రహ్మానందరెడ్డి, మల్లికార్జునరెడ్డి, శేషి కుమార్, జగదీశ్వర్ రెడ్డి, గురుప్రసాద్, రవి, కోశాధికారిగా విశ్వనాథ రెడ్డిలను ఎన్నుకున్నారు.



కేవీ నాగిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు



సురేష్ బాబు, ప్రధాన కార్యదర్శి

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

కడప రూరల్: మార్చి 3వ తేదీన నిర్వహించే జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నాగరాజు తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరకుమార్, సర్వైలెన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డాక్టర్ భార్గవి ఆధ్వర్యంలో వైద్య సిబ్బందితో జిల్లా స్థాయి వర్క్ షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసేలా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి, డాక్టర్ రవిబాబు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతికళ, ఖాజామొహిద్దీన్, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు

ఎన్నికల నిర్వహణకు ప్రణాళికలు

- శాఖల వారీగా వార్షిక లక్ష్యాలను సాధించాలి
- కలెక్టర్ అభిషిక్త్ కిశోర్



ప్రజలనుంచి వినతులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, ఇతర అధికారులు

రాయచోటి : జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఇప్పటి నుంచే సంసిద్ధత కావాలని.. అందుకోసం తగిన ప్రణాళికలను పక్కాగా రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్ నుంచి ఆర్డీఓలు, ఈఆర్‌ఓలు, నోడల్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు, మెడికల్, ఐసీడీఎస్, డ్వామా, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో 2024 తుది ఓటరు జాబితాకు సంబంధించి సమస్యల పరిష్కారం, మూడవ దశ రీసర్వే ప్రగతి, జగనన్న ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్, జగనన్న ఆరోగ్య సురక్ష, మహిళా శిశు సంక్షేమం, ఉపాధి కల్పన, గ్రామీణ, నీటిసరఫరా, పంచాయతీరాజ్ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బదిలీపై జిల్లాకు నూతనంగా వచ్చిన అధికారులు, సిబ్బంది అందరూ దాదాపు విధుల్లో చేరారన్నారు. నిర్వహించాల్సిన విధులపై వారందరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు జారీ చేసే మార్గదర్శకాలను ప్రాథమిక నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలన్నారు. జిల్లాలో తుది ఓటరు జాబితాను ప్రచురించిన పిదప ఇప్పటి వరకు అందిన క్లెయిమ్స్‌లో ఇంకా 7 వేల ఫారాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పోలింగ్ కేంద్రాల వారీగా బీఎల్‌ఓలతో తనిఖీ చేసి పరిష్కరించాలని ఈఆర్‌ఓలను ఆదేశించారు. ఫిబ్రవరి మాసాంతంలోగా రిటర్నింగ్ అధికారులు ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి.. కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో జరుగుతున్న మూడవ దశ రీసర్వే, 13వ నోటిఫికేషన్ ఫైనల్ ఆర్‌ఓఆర్, సర్వే రాళ్లను పాతడం తదితరాల ప్రగతిపై సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. అలాగే జిల్లాలో 68 వేలు జగనన్న ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందన్నారు. జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. ఇంటర్,10వ తరగతి పబ్లిక్ పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు. వీసీలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణరావు, ఎస్‌డీసీ శ్రీలేఖ, ఆర్డీఓలు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.


త్వరితగతిన సమస్యల పరిష్కారం

ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతగా పని చేయాలని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, ఎస్డీసీ శ్రీలేఖలు ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారులపై ప్రజలలో నమ్మకం పెరగాలంటే జగనన్నకు చెబుదాం అర్జీలను ఎలాంటి ఆలస్యం లేకుండా సకాలంలో వేగవంతంగా పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలను అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్ ఎప్పుడైనా రావచ్చని ఈ లోగా ప్రజల సమస్యలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి బాధ్యతగా వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రెవెన్యూ డివిజన్, మండలాలలో కూడా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని పటిష్టంగా ప్రాధాన్యతతో నిర్వహించాలని, డివిజన్, మండల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ప్రజల నుండి వారు అర్జీలను స్వీకరించారు.

ల్యాప్‌టాప్‌లు పంపిణీ

విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ తెలిపారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 5 మంది అంధ, బధిర విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 54 వేలు విలువతో మొత్తం రూ. 54 వేలు విలువతో మొత్తం రూ. 2.70 లక్షల విలువైన సాఫ్ట్‌వేర్ కలిగిన ల్యాప్ టాప్‌లను జిల్లా కలెక్టర్ ఉచితంగా పంపిణీ చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ రావు, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కో–ఆర్డినేటర్, జిల్లా సెరికల్చర్ ఆఫీసర్ రాజశేఖర్ రెడ్డి, జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు వీఆర్ కృష్ణ కిషోర్‌లు పాల్గొన్నారు.

కలెక్టర్‌తో జెడ్పీ చైర్మన్



కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ రెడ్డి

రాయచోటి : అన్నమయ్య జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్‌ను జిల్లా పరిషత్ ఛైర్మన్ ఆకేపాటి అమరనాధరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం సాయంత్రం రాయచోటిలోని కలెక్టర్ ఛాంబర్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజంపేట నియోజకవర్గ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించారు. జడ్పీ ఛైర్మన్‌తో పాటు రాజంపేట నియోజకవర్గ నాయకులు ఊటుకూరు పృథ్వీరెడ్డి, రాజంపేట జేఏసీ కన్వీనర్ గంగిరెడ్డి, నందలూరు సౌమ్యనాథ దేవాలయం మాజీ ఛైర్మన్ సౌమిత్ర తదితరులు ఉన్నారు.

'నులిపురుగుల నిర్మూలన'ను విజయవంతం చేయండి

జిల్లాలో ఫిబ్రవరి 9న చేపట్టేబోయే నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఫిబ్రవరి 9న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని పురస్కరించుకొని ప్రచార పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు.

క్లుప్తంగా

ప్రజల సమస్యలు పరిష్కరించాలి



వృద్ధుడి సమస్యలు వింటున్న అదనపు ఎస్పీ రాజ్ కమల్

రాయచోటి : పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ప్రజల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని జిల్లా అదనపు ఎస్పీ విబి రాజ్ కమల్ ఆదేశించారు. సోమవారం అన్నమయ్య జిల్లా రాయచోటి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ బి కృష్ణారావు ఆదేశాల మేరకు స్పందన కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ డాక్టర్ విబి రాజ్ కమల్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజలు అందించిన ఫిర్యాదులను స్వీకరించి అదనపు ఎస్పీ ఆయా ప్రాంతాల పోలీస్ అధికారులతో సమస్యలపై చర్చించారు. స్పందన ద్వారా వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి ఫిర్యాదుదారులకు సత్వరం న్యాయం చేకూర్చాలని సూచించారు. స్పందన కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి 45 మంది వచ్చి వివిధ సమస్యలపై వినతి చేశారు.

తాళ్లపాక పోస్టుమాస్టర్ ఆత్మహత్య

రాజంపేట : తాళ్లపాక బ్రాంచ్ పోస్టుమాస్టర్ ఆలమూరి శివదస్తగిరి (20) సోమ వారం చెయ్యేరులో పురు గుల నివారణ మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న నందలూరు ఎస్ఐ మహమ్మద్, మన్నూరు పోలీస్ నందకుమార్‌రెడ్డి తదితరులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహం లభించిన ఆధారాలను బట్టి పోస్టు మాస్టర్‌గా గుర్తించారు. మృతుడిది వైఎస్సార్ జిల్లా ఖాజీ పేట మండలం చెమ్ముల్లపల్లె గ్రామం, అతని తండ్రి వసంతకుమార్ బాబు అని తెలిపారు. ఏడాది కిందట తాళ్లపాకలో పోస్టుమాస్టర్‌గా చేరారని పోలీసుల విచారణలో తేలింది. ప్రస్తుతం బ్రహ్మణపల్లెలో ఉన్న బంధువులలో ఇంటిలో వుంటూ విధులు నిర్వర్తిస్తున్నట్లు సమాచారం. ఆత్మహత్యకు గల కారణాలు బయటికి రాలేదు. అయితే ప్రేమ విఫలం ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల బెడద.. నిత్యం వ్యథ

- రోడ్ల వెంట వేళ్లే వారిపై దాడులు
- వీధుల్లో తిరగలేకపోతున్న చిన్నారులు
- ఎక్కడ పడితే అక్కడ వ్యర్థాలు పడేస్తున్న వైనం



రోడ్డుపై గుంపుగా సంచరిస్తున్న కుక్కలు



గుర్రంకొండ-గాలివీడు మార్గంలో రోడ్డు పక్కనే పడేసిన కోళ్ల వ్యర్థాలు

గుర్రంకొండ : గుర్రంకొండ పట్టణంలో కుక్కల బెడదతో ప్రజలు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించడంతోనే ఈ పరిస్థితి తలెత్తింది. పట్టణ శివార్లలో రోడ్ల పక్కనే కోళ్ల వ్యర్థాలను పడేస్తున్నారు. వీటిని తినేందుకు అలవాటు పడిన ఊరకుక్కలు, పిచ్చికుక్కలు జనాలపై విజృంభిస్తున్నాయి.

రోడ్ల వెంట వెళ్లే పాదచారులు, ద్విచక్ర వాహనదారులపై విరుచుకు పడుతూ దాడులు చేస్తున్నాయి. ఈ సంఘటనల్లో పలువురు గాయపడి ఆస్పత్రుల పాలవుతున్నారు. నెల రోజుల్లోనే నాలుగు మార్లు పచ్చికుక్కల దాడులో 16 మంది గాయాల పాలయ్యారు. పట్టణంలోని పలు వీధుల్లో ఇళ్లలోనే కోళ్లను కోసి వాటి వ్యర్థాలను పరిసరాలు, మురుగునీటి కాలువల్లో పడేస్తున్నారు. దీంతో వీధుల్లో కుక్కలు గుంపులుగా సంచరిస్తుండడంతో చిన్నారులు భయాందోళనకు గురవుతున్నారు.

రోడ్ల పక్కనే కోళ్ల వ్యర్థాలు

పట్టణంలో 18 చికెన్ దుకాణాలు నిర్వహిస్తున్నారు. చికెన్ అమ్మకాల్లో భాగంగా కొన్ని వ్యర్థాలను దుకాణాల పక్కనే పడేస్తున్నారు. మరి కొన్ని వ్యర్థాలు, కోడి ఈకలు మొత్తం కలిపి పట్టణం వెలుపల పడేస్తున్నారు. కడప-బెంగళూరు జాతీయ రహదారి, గుర్రంకొండ- గాలివీడు, గుర్రంకొండ-కలకడ మార్గాలలోని రోడ్ల పక్కనే ఈ వ్యర్థాలను వేస్తున్నారు. పట్టణంలోని వందలాది కుక్కలు ఈ వ్యర్థాలను తినేందుకు అలవాటు పడ్డాయి. అటువైపు గుంపులుగా సంచరిస్తుంటాయి. ఈ క్రమంలో అటువైపు వెళ్లే పాదచారులపైన దాడికి దిగుతున్నాయి. పట్టణం నుంచి పల్లెలకు వెళ్లే మార్గాల్లో కాపు కాచి పాదచారులు, ద్విచక్రవాహనాలపై దాడులు చేస్తున్నాయి. ఒంటరిగా వెళ్లాలంటే జనం హడలెత్తి పోతున్నారు. ద్విచక్ర వాహనదారులను చాలా దూరం వరకు వెంబడిస్తూ దాడులకు పాల్పడుతున్నాయి. ఈ సంఘటనల్లో పలువురు గాయాల పాలవుతున్నారు.

నెల రోజుల్లో నాలుగు మార్లు దాడులు

గత నెల రోజులుగా పిచ్చికుక్కలు పట్టణంలో నాలుగుమార్లు దాడులు నిర్వహించాయి. ఇందిరమ్మకాలనీ, తాళింవీధి, బలిజగడ్డ వీధుల్లో పిచ్చికుక్కలు యథేచ్ఛగా సంచరించి ఇష్టానుసారంగా దాడులు చేశాయి. ఈ సంఘటనల్లో 16 మంది గాయపడి ఆస్పత్రుల పాలయ్యారు. ఇటీవల వీధిలో ఆడుకుంటున్న మూడేళ్ల బాలుడు రిహాన్‌పై పిచ్చికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. గతంలో కుక్కల దాడిలో ఓ బాలుడు మృతి చెందగా.. పలువురు చిన్నారులు గాయపడిన సంఘటనలు ఉన్నాయి. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులపై గతంలో దాడులు నిర్వహించడంతో గాయాల పాలయ్యారు.

హడలెత్తిపోతున్న జనం

వీధుల్లో గుంపులుగా వీధికుక్కలు, పిచ్చికుక్కలు సంచరిస్తుండడంతో జనం హడలెత్తి పోతున్నారు. ఒంటరిగా వెళ్లే వారిపై దాడులకు పాల్పడుతున్నాయి. చిన్నారులు ఒంటరిగా కనిపిస్తే కుక్కలు ముకుమ్మడిగా దాడులు చేస్తున్నాయి. దీంతో చిన్నారుల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే పిల్లలపై కుక్కలు దాడులు చేస్తుండటం గమనార్హం.

చర్యలు తీసుకుంటాం



పట్టణంలో పిచ్చికుక్కలు, ఊరకుక్కలు సంచారం ఎక్కువగా ఉంది. జనాలపై దాడులు చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. గతంలో చాలా వరకు కుక్కల్ని బయట ప్రాంతాలకు తరలించారు. మళ్లీ కుక్కల బెడద ఎక్కువగా అవడంతో తగిన చర్యలు చేపడతాం.

– విశ్వనాథ్, పంచాయతీ ఈవో, గుర్రంకొండ

బస్సులో నుంచి జారిపడి వ్యక్తి మృతి



రోడ్డుపైనే మృతి చెందిన సుబ్రమణ్యం

రామసముద్రం : వేగంగా వెళ్తున్న బస్సులో డోర్ వద్ద నిలుచున్న ప్రయాణికుడు సుబ్రమణ్యం(28) ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడి ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన సోమవారం రామసముద్రం-ముళబాగిల్ రోడ్డు మార్గంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రామసముద్రం మండలం పెద్దకురప్పల్లెకు చెందిన బయ్యప్ప కుమారుడు సుబ్రమణ్యం సొంత పనుల నిమిత్తం కర్ణాటక రాష్ట్రం ముళబాగిల్‌కు వెళ్లి తిరుగు ప్రయాణంలో ప్రైవేటు బస్సులో ఎక్కి డోర్ వద్ద నిలుచున్నాడు. ఈ క్రమంలో ముళబాగిల్ నుంచి బస్సు కొంత దూరం వెళ్లగా.. సుబ్రమణ్యం ప్రమాదవశాత్తు బస్సు నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

రైలు నుంచి పడి ..

ములకలచెరువు : రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని బురకాయలకోట సమీపంలో సోమవారం రైల్వే ట్రాక్ పక్కన ఒక వ్యక్తి మృతదేహాన్ని గొర్రెల కాపరులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలంలో పడి ఉన్న మృతదేహాన్ని పరిశీలించి కదిరి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రైల్వే ఎస్ఐ రహీం సిబ్బందితో కలసి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి వయసు 55 ఏళ్లు ఉంటుందని, నల్ల ప్యాంటు, తెల్ల షర్టు ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని రైల్వే ఎస్ఐ సూచించారు.

గంజాయి ముఠా అరెస్ట్

- పోలీసుల అదుపులో ఆరుగురు నిందితులు
- కారు, వంద కిలోల గంజాయి సీజ్



పట్టుకున్న గంజాయి ప్యాకెట్లతో సీఐ, ఎస్ఐ, సిబ్బంది

పెద్దతిప్పసముద్రం : గంజాయి ముఠాను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి కారు, వంద కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. పెద్దతిప్పసముద్రం, ములకలచెరువు మండలాల సరిహద్దులోని సంద్రడవి అటవీ ప్రాంతంలో గత నెల 30న గంజాయి, కారుతోపాటు ఒక నిందితుడిని పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అన్నమయ్య జిల్లా ఎస్పీ సమగ్రంగా దర్యాప్తు చేపట్టి కేసును ఛేదించాలని ములకలచెరువు సీఐ తమ్మిశెట్టి మధును ఆదేశించారు. ఈ కేసును సీఐ సవాల్‌గా తీసుకుని ఆరు ప్రత్యేక పోలీసు బృందాలతో గాలించి ఆరుగురు నిందితులను పట్టుకుని, గంజాయితోపాటు మరో కారును సోమవారం స్వాధీనం చేసుకున్నారు. సీఐ కథనం మేరకు వివరాలిలా... మండలంలోని రాపూరివాండ్లపల్లి పంచాయతీ కాయలవాండ్లపల్లికి చెందిన అక్కినపల్లి నాగరాజు (26), డి.నారాయణపల్లికి చెందిన కోసువారిపల్లి బాలాజి అలియాస్ బాలు (26) స్నేహితులు. వీరు ఈ కేసులో ప్రధాన నిందితులు. వీరిద్దరూ సులువుగా డబ్బు సంపాదించాలనే ఆశతో మదనపల్లిలోని చంద్రా కాలనీలో ఉంటున్న ఓబులేసు అలియాస్ శ్యాంసంగ్ (28), ఆవుల కొండయ్య అలియాస్ రవి (28)తో పరిచయాలు ఏర్పరచుకున్నారు. అనంతరం నాగరాజు, బాలు రెండు కార్లను కొనుగోలు చేసి చంద్రా కాలనీలో పరిచయమైన వ్యక్తులతోపాటు కాయలవాండ్లపల్లికి చెందిన అక్కినపల్లి మల్లికార్జున (32), బి.కొత్తకోటకు చెందిన బైరిశెట్టి అనిల్‌కుమార్ (25)లను అక్రమ వ్యాపారానికి భాగస్తులుగా చేసుకున్నారు. ప్రధాన నిందితులైన ఇద్దరు నర్సీపట్నం, అరకు, ఒరిస్సా సరిహద్దులో ముందుగా రెక్కీ నిర్వహించి అక్కడి వ్యాపారస్తులతో బేరసారాలు మాట్లాడి స్వగ్రామాలకు చేరుకుంటారు. అనంతరం మిగిలిన నలుగురు వ్యక్తులు కలిసి అక్కడి అటవీ ప్రాంతాల మీదుగా గుర్రాల్లో వెళ్లి.. అనంతరం నడచుకుంటూ పోలీస్ చెక్‌పోస్టులు తప్పించుకుని.. గంజాయి బస్తాలను రోడ్డు మార్గానికి చేర్చి ముందుగానే సిద్ధం చేసుకున్న కార్లలో నిల్వ చేస్తారు. ముందుగా ఒక కారులో పైలెట్ వెళ్లి రెక్కీ నిర్వహిస్తూ వెనుక నుంచి గంజాయి బస్తాలను మరో కారులో తరలించి నిర్మానుష్యంగా ఉంటున్న అటవీ ప్రాంతాల్లో గుట్టుగా నిల్వ చేసి మదనపల్లి, బి.కొత్తకోట, బెంగళూరులో విక్రయిస్తారు. పోలీసు బృందాల గాలింపుల్లో పట్టుకున్న ఆరుగురు నిందితులను రిమాండ్‌కు పంపారు. వారి నుంచి స్వాధీనం చేసుకున్న ఒక కారు, రూ.30 లక్షల విలువ చేసే వంద కిలోల (50 ప్యాకెట్లు) గంజాయిని సీజ్ చేశారు. సీఐ మాట్లాడుతూ ప్రధాన నిందితులైన నాగరాజు, బాలుపై 2022లో బెంగళూరులోని ఆర్‌టీ నగర్‌లో గంజాయి కేసు నమోదైందని తెలిపారు. ఈ కేసులో మరి కొంత మంది నిందితులు ఉండటంతో నిఘా ముమ్మరం చేశామన్నారు. అనంతరం సీఐ ఈ కేసును ఛేదించడంలో ప్రత్యేక చొరవ చూపిన ఎస్ఐ రవీంద్రబాబుతో పాటు సిబ్బందికి అభినందనలు తెలిపారు.

నేడు తలనీలాల వేలం

సిద్దవటం : మండల పరిధి వంతాటిపల్లె గ్రామ సమీపంలోని లంకమల అడవుల్లో ఉన్న శ్రీ నిత్యపూజస్వామి కోనలో మహా శివరాత్రి ఉత్సవాల్లో స్వామికి భక్తులు సమర్పించుకునే తలనీలాల పోగు హక్కు కోసం మంగళవారం బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నామని ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, చైర్మన్ కొండారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సిద్దవటంలోని శ్రీరంగనాయకస్వామి ఆలయంలో ఉదయం 11 గంటలకు దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో ఈ వేలం పాట ఉంటుందని వారు పేర్కొన్నారు. మహాశివరాత్రి ఉత్సవాలు మార్చి 7 నుంచి 9వ తేదీ వరకు జరుగునని వివరించారు.

బెటాలియన్ కమాండెంట్ బాధ్యతలు స్వీకరణ



రవిశంకర్

సిద్దవటం : మండల పరిధి భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్ కమాండెంటుగా రవిశంకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న కమాండెంటు శ్రీనివాసరావు కర్నూలు 2వ బెటాలియన్‌కు బదిలీ కాగా, కర్నూల్ 2వ బెటాలియన్‌లో కమాండెంటుగా పని చేస్తున్న రవిశంకర్ ఇక్కడికి బదిలీ అయ్యారు. ఈయన 1984లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధుల్లో చేరి అంచలంచలుగా కమాండెంటు స్థాయికి ఎదిగారు. టీటీడీ విజిలెన్స్ అధికారిగా 10 ఏళ్లు, అలాగే టాస్క్ ఫోర్స్ విభాగంలో ఎస్పీగా పని చేశారు. తిరుపతి, కడప జిల్లాల్లో దాదాపుగా రూ. 5 కోట్ల విలువ చేసే ఎర్రచందనం దుంగలను సీజ్ చేయడంతోపాటు, 900 మంది ఎర్రచందనం నిందితులను పట్టుకొని జైలుకు పంపారు. ఈ సందర్భంగా కమాండెంటు రవిశంకర్ మాట్లాడుతూ బెటాలియన్ అభివృద్ధికి, సిబ్బంది సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. ఈయన అంతకు ముందు బెటాలియన్‌లో వెలసిన శ్రీ దుర్గామాత అమ్మవారిని దర్శించుకొని పూజలు చేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి అడిషనల్ కమాండెంటు పి.ఎ న్.డి. ప్రసాద్, డీఎస్పీ జయప్రసాద్, ఆర్ఐలు అలీబాషా, శ్రీనివాసరావు, సీఆర్‌కే రాజు, రంగారావు, దానయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బియ్యం దుకాణంలో చోరీ

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటం రోడ్డులోని ఓ బియ్యం దుకాణంలో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. స్థానిక సిద్దవటం రోడ్డులోని నూర్‌బాషా కాలనీకి చెందిన పఠాన్ చిన్నమౌలాలి ఎన్‌జీవో కాలనీ సమీపంలో బియ్యం దుకాణం నిర్వహిస్తున్నాడు. ధాన్యం కొనుగోలు చేసిన వ్యక్తులకు సోమవారం ఉదయం డబ్బులు చెల్లించాలన్న ఉద్దేశంతో దుకాణంలో ఆదివారం రాత్రి రూ.2.40 లక్షల నగదును భద్రపరిచి తాళం వేసి వెళ్లాడు. ఉదయం దుకాణాన్ని తెరిచేందుకు వెళ్లగా తాళాలు పగులకొట్టి ఉండటంతో అనుమానం వచ్చి లోపలి గదిలోని అల్మారా వద్దకు వెళ్లగా.. అందులో భద్రపరిచిన నగదు కనిపించలేదు. దీంతో చోరీ జరిగినట్లు గ్రహించి అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అర్బన్ సీఐ యుగంధర్, ఎస్ఐ సత్యనారాయణ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని నిందితుల కోసం గాలిస్తున్నారు.

బీసీవై పార్టీ గోడ గడియారాల కంటైనర్ సీజ్




రామసముద్రంలో సీజ్ చేసిన బీసీవై పార్టీ కంటైనర్

రామసముద్రం : మండలంలోని కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన అనపల్లి కొత్తూరు చెక్ పోస్టులో సోమవారం రాత్రి బీసీవై పార్టీకి చెందిన కంటైనర్‌ను స్థానిక పోలీసులు సీజ్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. భారత్ చైతన్య యువజన పార్టీకి చెందిన పేరుతో ముద్రించిన గోడ గడియారాల కంటైనరు గుజరాత్ రాష్ట్రం నుంచి కర్ణాటక మీదుగా అనపల్లి కొత్తూరు చెక్ పోస్టులోకి వచ్చింది. అనుమానం వచ్చిన పోలీసులు కంటైనర్‌ను తనిఖీ చేయగా.. అందులో బీసీవై పార్టీ పేరుతో ముద్రించిన 312 బాక్సులలో ఒక్కొక్క బాక్స్‌కు 12 గడియారాల చొప్పున 6864 గడియారాలు ఉన్నాయి. దీన్ని గుర్తించిన పోలీసులు కంటైనర్‌ను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ పేర్కొన్నారు.

చోరీ కేసులో ఇద్దరికి జైలు

కొండాపురం : తాళ్లప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని తాళ్లప్రొద్దుటూరు, టి.కోడూరు గ్రామాల్లో వేర్వేరుగా జరిగిన దొంగతనం కేసుల్లో ఇద్దరు నిందితులకు ఆరు నెలలు జైలు శిక్ష పడింది. కోర్టు కానిస్టేబుల్ సుబ్బరాయుడు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తాళ్లప్రొద్దుటూరు గ్రామంలో పుల్లయ్య కిరాణ దుకాణంలో 2022లో చోరీకి పాల్పడిన బోయ హరిక్రిష్ణ, జగ్గం పుల్లయ్య.. 2023లో టి.కోడూరు గ్రామంలో మారెమ్మ గుడి అమ్మవారి కిరీటం దొంగలించారు. ఈ కేసుల్లో వారికి జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి భార్గవి సోమవారం ఆరు నెలలు జైలు శిక్ష విధించారు.

విదేశీయుడికి పాస్‌పోర్ట్ అప్పగింత



బాధితులకు పాస్‌పోర్ట్, పర్సును అందిస్తున్న టూటౌన్ పోలీసులు

మదనపల్లె : సినిమా థియేటర్‌లో పాస్‌పోర్ట్ పోగొట్టుకున్న విదేశీయుడి కుటుంబానికి టూటౌన్ ఎస్ఐలు వెంకటసుబ్బయ్య, ఇనాయతుల్లా సోమవారం సాయంత్రం అందజేశారు. లక్కిరెడ్డిపల్లె మండలం రెడ్డివారిపల్లెకు చెందిన మాసాబీ అలియాస్ ఆయేషా ఉపాధి కోసం విదేశాలకు వెళ్లారు. అక్కడ తనకు పరిచయమైన సిరియా దేశానికి చెందిన మహమ్మద్ అబూబాసలాల్ హనీఫాను రెండో వివాహం చేసుకుంది. ఇద్దరూ కలిసి జనవరి 16న లక్కిరెడ్డిపల్లెలోని రెడ్డివారిపల్లెకు వచ్చారు. బంధువులను కలుసుకునే క్రమంలో ఫిబ్రవరి 3న అంగళ్లుకు వచ్చారు. బంధువులతో కలిసి మదనపల్లె శ్రీకృష్ణ థియేటర్‌లో ఫస్ట్‌షోకు వెళ్లారు. సినిమా అయిపోయాక, ఇంటికెళ్లే హడావుడిలో పాస్‌పోర్ట్, నగలు, డబ్బులు ఉన్నటువంటి పర్స్‌ను థియేటర్‌లో మరచిపోయి వెళ్లిపోయారు. తర్వాత కొద్దిసేపటికి పర్స్ మరచిపోయిన విషయాన్ని గుర్తుతెచ్చుకుని థియేటర్‌కు వెళ్లి చూడగా కనిపించలేదు. దీంతో పాస్‌పోర్ట్ పోయిన విషయం టూటౌన్ పోలీసులకు, జిల్లా ఎస్పీ కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. అనంతరం థియేటర్ సీసీ పుటేజీలను పరిశీలిస్తే.. ఓ గుర్తుతెలియని వ్యక్తి పర్స్ తీసుకెళుతున్నట్లు గుర్తించారు. ఈ క్లిప్పింగ్‌ను సోషల్ మీడియా, వార్తాపత్రికల్లో విస్తృతంగా ప్రచారం కల్పించారు. కర్ణాటక ముళబాగల్ ముత్యాలపేటకు చెందిన వెంకటప్ప రమేష్(40) మదనపల్లె సొసైటీ కాలనీ గేటులోని అత్తారింటికి వచ్చాడు. అతను కృష్ణథియేటర్‌లో ఫస్ట్‌షోకు వెళ్లి తిరిగి వెళ్లే క్రమంలో సీటులో పర్స్ ఉండటాన్ని గుర్తించి వెంట తీసుకెళ్లాడు. అందులోని వస్తువులను గమనించి, స్వచ్ఛందంగా టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి వాటిని అందజేశారు. పోలీసులు బాధితులను స్టేషన్‌కు పిలిపించి పర్సు అందజేశారు. అందులోని రెండు పాస్‌పోర్టులు, డ్రైవింగ్ లైసెన్స్, విదేశీ, స్వదేశీ నగదు, బంగారు ఆభరణం అన్నీ ఉన్నాయని చెప్పారు. పోయిందనుకున్న పాస్‌పోర్ట్, వస్తువులు దక్కడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది శ్రీనివాసులునాయుడు, ప్రసాద్ పాల్గొన్నారు.

నవశకం

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్తోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. –సాక్షి నెట్‌వర్క్

సొంతింటి కల నెరవేరింది



మా సొంతింటి కల నెరవేరింది. నిరుపేదలైన మాకు గతంలో మాకు ఇల్లు లేక అనేక అవస్థలు పడ్డాము. జగనన్న ముఖ్యమంత్రి కాగానే మాకు స్థలంతోపాటు ఇల్లు మంజూరు చేశారు. ప్రభుత్వం అందించిన నగదు, సిమెంటు, ఇసుక, కడ్డీలు తదితర సామగ్రితోపాటు మా రెక్కల కష్టాన్ని తోడు చేయడంతో ఇల్లు బాగా కట్టుకున్నాము. మాకు అమ్మఒడి, విద్యాదీవెన, వైఎస్సార్ ఆసరా తదితర పథకాలను ప్రభుత్వం అందించింది. మా పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలో రుచికరమైన ఆహారంతోపాటు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించడం సంతోషం. మరలా జగనన్నే ముఖ్యమంత్రి అయితే నాలాంటి నిరుపేదలందరూ ఆర్థికంగా అభివృద్ధి చెందడంతోపాటు పిల్లలు విద్యలో రాణించి ఉన్నత శిఖరాల వైపు అడుగులేస్తారు.

– పోలి చెంగల్‌రెడ్డి, రామక్కపల్లి, పుల్లంపేట, అన్నమయ్య జిల్లా

బిడ్డల చదువులు సాఫీగా సాగుతున్నాయ్..



మాది పేద కుటుంబం. నా భర్త బాబు కూలీ పనులు చేస్తాడు. దీంతో జీవనం సాగుతోంది. మా కుమారుడు సందీప్ 5వ తరగతి చదువుతున్నాడు. పాప లాస్య 4వ తరగతి చదువుతోంది. బిడ్డలను చదివించాలంటే కష్టంగా ఉండేది. జగనన్న ముఖ్యమంత్రి కావడంతో నా బిడ్డకు అమ్మ ఒడి పథకం కింద రూ.15 వేలు వస్తోంది. దీంతో నా బిడ్డల చదువులు సాఫీగా సాగుతున్నాయి. బడిలో పుస్తకాలు, యూనిఫాం అన్నీ ఉచితంగా ఇచ్చారు. నా బిడ్డలు చదువుతున్నారంటే అది జగనన్న పుణ్యమే. థ్యాంకు జగనన్న.

–అనూష, మల్లికార్జున సర్కిల్, మదనపల్లె